# నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి.. జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, వుదయం**

నిర్ణీత గడువులోగా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి మండలం , మంథని పట్టణ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. రామగిరి మండలంలోని కేజీబీవీ విద్యాలయం, నూతనంగా నిర్మించడానికి సిద్ధంగా ఉన్న తహసిల్దార్ భవన స్థలం కలెక్టర్ పరిశీలించారు. మంథని పట్టణంలోని సంగీత పాఠశాల, మున్సిపల్ కార్యాలయ, జూనియర్ బాయ్స్ స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంథని పట్టణం లోని షెడ్యూలు కులాల బాలికల వసతి గృహం, ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి కేజీబీవీ లో నూతనంగా ఏర్పాటు చేసిన మాడ్యులర్ కిచెన్ ను ప్రారంభించారు. స్టీమ్ రైస్ బాయిలర్, ఆటోమేటిక్ రోటి మేకర్, ఇడ్లీ బాయిలర్, ఎల్.పీ.జి గ్యాస్ లైన్, 18 డైనింగ్ టేబుల్స్ లను సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. రామగిరి తహసిల్దార్ కార్యాలయం నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. మంథని సంగీత స్కూల్ ప్రిన్సిపాల్ సూచనల మేరకు అభివృద్ధి పనులను 15 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పట్టణంలో నూతనంగా చేపడుతున్న పురపాలక కార్యాలయ నిర్మాణ పనులు నిర్దిష్ట గడువు లోగా పూర్తయ్యే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని లోని జూనియర్ బాయ్స్ స్కూల్ లో పెండింగ్ ఉన్న చిన్న చిన్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురుకుల పాఠశాలలో స్టేజి, డార్మటరీ, డైనింగ్ హాల్ వంటి అభివృద్ధి పనులు పూర్తి చేసామని, పాత స్కూలు భవనం, హస్టల్ కు అవసరమైన మరమ్మతులు చేయించి పెయింటింగ్ వేయాలని కలెక్టర్ సూచించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రిన్నోవేషన్ భాగంగా పెయింటింగ్, అంతర్గత సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి పనులు స్లాబ్ దశలో ఉన్నాయని వీటిని గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంటరామగిరి తహసిల్దార్ సుమన్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్,టిజి ఎంఎస్ఐడిసి ఈఈ విక్రమ్, ఈఈ పంచాయతీ రాజ్ శంకరయ్య, ఏఈలు అనుదీప్,వరలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారెంటీలు పెద్ద బోగస్..
## బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి

**కరీంనగర్, వుదయం**




అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చిందని, ముఖ్యంగా ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రజానీకాన్ని నమ్మించి మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 1000 రోజులు కావస్తున్న ఏ ఒక్క గ్యారెంటీని సక్రమంగా అమలు చేయలేకపోయిందని, కాంగ్రెస్ సర్కార్ 6 గ్యారెంటీలు పెద్ద బోగస్ అని ఆయన ఘాటుగా విమర్శించారు. 6 గ్యారంటీలు కాంగ్రెస్ హామీల వైఫల్యాన్ని ఎండగడుతూ బిజెపి రాష్ట్ర శాఖ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు అనంతరం అడిషనల్ కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేసి చూపిస్తామని మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. నేడు ఆ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడిచినా కూడా ఇచ్చిన వాగ్దానం హామీ వాగ్దానాన్ని నిలుపుకోలేని దౌర్భాగ్య పరిస్థితిల్లో ఉన్నందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. ముఖ్యంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు కేవలం ఫ్రీ బస్సును కల్పించి మహిళలకు ప్రతి నెల రూ. 2500 , రూ. 500 కే గ్యాస్ సిలిండర్ ను ఎగ్గొట్టిందన్నారు. రైతు భరోసాకు భరోసా లేకుండా పోయిందన్నారు. రైతు భరోసా అందించడానికి అనేక కొర్రీలు పెడుతూ రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేసిందన్నారు.రైతు కూలీల రైతు భరోసాకు మంగళం పాడిందన్నారు. ప్రధానంగా ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో రూ.15 వేల రైతు భరోసా అందిస్తామని ప్రకటించి రూ.12 వేలకు కుదింపు చేసి రైతాంగాన్ని తీవ్రంగా మోసం చేసిందన్నారు.యువ వికాస పథకాన్ని గాలికి వదిలేసిందన్నారు.5 లక్షల విద్యా భరోసా కార్డు ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు పత్తా లేకుండా పోయిందన్నారు.చేయూత పథకానికి కాంగ్రెస్ సర్కార్ చేయించిందని, పెన్షన్లను పెంచుతామని పెన్షన్ దారులను తీవ్రంగా మోసం చేసిందన్నారు.రూ. 4000 పెన్షన్ ఇవ్వడానికి హస్తం పార్టీకి చేతులు రావడం లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇడ్ల స్థలం ఉన్నవారికి 5 లక్షల ఆర్థిక సాయం, తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం అంశం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అటకెక్కిచ్చిందన్నారు. గృహజ్యోతి పథకం కింద అర్హులైన వారికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే పథకం తూతూ మంత్రంగా అమలు చేసి చేతులు దులుపుకుందని ఆయన మండిపడ్డారు.ఆరు గ్యారంటీలను అమలు చేయలేని కాంగ్రెస్ సర్కార్ పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని తెలిపారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, బిజెపి చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు.

ఆరూ గ్యారెంటీల కోసం బిజెపి ప్రజానీకానికి అండగా ఉంటుందని, కాంగ్రెస్ సర్కార్ మెడలు వంచైనా సరే ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసే దాకా విడిచి పెట్టే ప్రసక్తి లేదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధులు సంగప్ప, వై.సునీల్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేష్, ఈ.నాగేశ్వర్ రెడ్డి, వాసాల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, కల్లెం వాసుదేవరెడ్డి, రంగు భాస్కరాచారి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, ఎస్సీమోర్చాజిల్లా అధ్యక్షుడు సోమిడి వేణు, జిల్లా ఎలక్షన్ సెల్ కన్వీనర్ బండా రమణ రెడ్డి -కార్పొరేటర్లు వొంటెల సత్యనారాయణ రెడ్డి, భూపతి రవీందర్, మ్యాకాల వెంకటేష్, మాసం గణేష్, ఏన్నం ప్రకాశ్, కరీంనగర్ జోన్, మండల బాధ్యులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ లో ప్రాధాన్యతా రంగాలకు పెద్ద పీట : ఎమ్మెల్యే కవ్వంపల్లి

**కరీంనగర్, వుదయం**



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్ లో ప్రాధాన్యతా రంగాలకు పెద్దపీట వేశారని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ఈ బడ్జెట్ లో వ్యవసాయం, విద్య, విద్యుత్, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించారని ఆయన పేర్కొన్నారు. విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆ రంగం అభివృద్ధి కోసం రూ.26,674 కోట్లు కేటాయించడం సహేతుకమన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం ఆ శాఖకు రూ.23,179 కోట్లు కేటాయించడం ద్వారా ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలించిందన్నారు. అలాగే మరో కీలకమైన విద్యుత్ శాఖకు రూ. 21,285 కోట్లు కేటాయించడం శుభ పరిణామమని ఆయన పేర్కొన్నారు. బీసీ సంక్షేమానికి రూ.12,511 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.7,934 కోట్లు, మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు కేటాయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉదాతరతను చాటుకున్నదని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం అధిక నిధులు కేటాయించారని, అందుకే ఈ బడ్జెట్ సబ్బండవర్ణాల సంక్షేమ బడ్జెట్ గా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు బడ్జెట్ లో అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, రూ. 50,713 కోట్లు కేటాయించడం ద్వారా వీటి అమలుపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను ప్రభుత్వం పటాపంచలు చేసినట్టయిందని ఆయన ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే నిర్దేశించుకున్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నిధుల కేటాయింపు జరిగినట్టుగా విదితమవుతోందని ఆయన పేర్కొన్నారు. మంచి బడ్జెట్ రూపకల్పన చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని, బడ్జెట్ ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను డాక్టర్ కవ్వంపల్లి అభినందించారు.

# బడ్జెట్ అంకెలు, మాటలు ఘనంగా కనిపించే గారడి

**కరీంనగర్, వుదయం:**



ఈ బడ్జెట్ లో నైనా ఆరు గ్యారంటీలు అమలు చేస్తారని ప్రజలు ఎంతో ఆశగా చూశారని, మళ్లీ వాళ్ళ ఆశలపై కాంగ్రెస్ నీళ్లు చల్లిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. బడ్జెట్లో కాంగ్రెస్ హామీలకు, ఆరు గ్యారంటీలకు కేటాయింపులే లేవన్నారు. మహిళలకు రూ.2500 ఊసే లేదన్నారు. చేయూత కిందఇస్తామన్నా రూ.4000ల పింఛన్ అతి గతి లేదన్నారు.తులం బంగారం, నిరుద్యోగ భృతికి కేటాయింపులు లేవన్నారు.ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయని, బడ్జెట్ కాంగ్రెస్ హామీలకు అనుగుణంగా లేదని, మాటలు ఘనంగా కనిపించే గారడి అన్నారు.

# ఘూలేలాల్ జీ స్ఫూర్తితో సింధీ లకు ప్రత్యేక గుర్తింపు
## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్, వుదయం**



ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి ఉన్న ఒక ప్రాచీన, సాంస్కృతికంగా సమృద్ధి చెందిన సమాజం సింధీలదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. దేశ విభజన సమయంలో సింధీ సమాజానికి విపరీతమైన నష్టం జరిగినా, ఝూలేలాల్ జీ స్ఫూర్తితో ఆయన చూపిన బాటలో నడుస్తూ ప్రత్యేక గుర్తింపును తిరిగి తెచ్చుకుంటూ తమ సంప్రదాయాలను కొనసాగిస్తున్న ఘనత సింధీ సమాజానిదేనని పేర్కొన్నారు. సింధీల ఆర్యాధ్య దైవం ఝూలేలాల్ జయంతి. తెలుగు వారికి ఉగాది పర్వదినం మాదిరిగానే ఝూలేలాల్ జయంతి రోజే సింధీలు నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటారు. ఈ సందర్భంగా శుక్రవారం సింధీ సామాజిక వర్గం వారంతా కరీంనగర్ లోని గాంధీ రోడ్ వైశ్యా భవన్ సమీపంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. సింధీ యువకులు, మహిళలు ఉల్లాసంగా, ఉత్సాహంగా నృత్యం చేయగా, వారితో కలసి బండి సంజయ్ సైతం డ్యాన్సు చేశారు. అనంతరం సింధీలు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సింధీ సామాజికవర్గాన్ని ఉద్దేశించి ఒక ప్రకటన విడుదల చేశారు.'దేవుడు ఒక్కరే, మానవత్వం ఒక్కటే''నని చెప్పిన ఝూలేలాల్ జీ జీవితం ధైర్యం, ఐక్యత, అన్యాయానికి వ్యతిరేకంగా విశ్వాసానికి ప్రతీకగా నిలిచింది. కష్ట కాలాల్లో ఇబ్బందులు ఎదురైనా అంతిమంగా సత్యమే గెలుస్తుందని, ఆ విశ్వాసమే మార్గాన్ని చూపుతుందని ఝూలేలాల్ జీ ఇచ్చిన సందేశం అన్ని మతాల కులాల ప్రజలందరికీ అనుసరణీయమని ఆయన పేర్కొన్నారు.

# పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది విశ్రాంతి గదిని ప్రారంభించిన సీపీ గౌష్ ఆలం



కరీంనగర్, మార్చి 20, వుదయం ప్రతినిధి : పోలీస్ సిబ్బంది సంక్షేమం, పనితీరును మెరుగుపరిచే లక్ష్యంతో, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన విశ్రాంతి గదిని ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి మానసిక ప్రశాంతత, శారీరక విశ్రాంతి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో రాజీ పడబోమని, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను ఆధునీకరించి, సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించడానికి విభాగం కట్టుబడి ఉందని సీపీ తెలిపారు. తగిన విశ్రాంతి పొందిన అధికారులు అత్యవసర సమయాల్లో ప్రజలకు సేవ చేయడంలో మరింత చురుగ్గా, సమర్థవంతంగా పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్ , రూరల్ ఏసీపీ విజయకుమార్, ట్రాఫిక్ ఏసీపీ వెంకటస్వామి , రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, ఎస్సె లు నరేష్, లక్ష్మా రెడ్డి లతో పాటు ఇతర పోలీసు అధికారులు, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# బసంత్ నగర్ విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలి

**పెద్దపల్లి, వుదయం**



టీజీ ఎన్పీడీసీఎల్ పెద్దపల్లి సర్కిల్ పరిధి బసంత్ నగర్ ఆపరేషన్ ఏఈ మానాల ప్రసాద్ పై చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. స్వామి డిమాండ్ చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్లలో పని చేస్తున్న ఆపరేటర్ల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ బెదిరిస్తున్నారని ఏఈ ప్రవర్తన సరిగా లేదని విచారణ జరిపి శాఖా పరమైన చర్యలు చేపట్టాలని శుక్రవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ లో గల ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆపరేటర్లు, యూనియన్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఆపరేటర్లను కక్ష్య పూరితంగా వేధిస్తున్నారని ఎస్ఈ గంగాధర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఏఈ తీరుతో సబ్ స్టేషన్లలో పనిచేసే ఆపరేటర్లు భయాందోళన చెందుతున్నారని వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో మద్యం మత్తులో ఏఈ సబ్ స్టేషన్ లను సందర్శించి ఆపరేటర్లను ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఏఈ వైఖరిపై తక్షణమే విచారణ జరిపి ఆపరేటర్లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజీ ఎన్పీడిసిఎల్ కంపెనీ ప్రెసిడెంట్ జి.ఆంజనేయులు, రీజనల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాగు నాయక్, సిహెచ్ నర్సయ్య, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండయ్య, కె.నరేష్, పెద్దపల్లి సర్కిల్ గౌరవ అధ్యక్షులు భిక్షపతి, మంథని డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్, సర్కిల్ పరిధిలోని ఆపరేటర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# భారత సైన్యంలో నియామకానికి ఆన్‌లైన్ నమోదు, దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం - నియామక సంవత్సరం 2027

**పెద్దపల్లి, వుదయం**

1.భారత సైన్యంలో వివిధ కేటగిరీల్లో నియామకానికి సంబంధించి అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించడానికి ఆన్‌లైన్ నమోదు, దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది.

2.అగ్నివీర్ కేటగిరీల్లో అవివాహిత యువత కోసం నియామక నోటిఫికేషన్ 13 ఫిబ్రవరి 2026న www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో విడుదలైంది. సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ పరిధిలోని తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నివాసితుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. ఆ జిల్లాలు: ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, మహబూబాబాద్, మంచిర్యాల, మెడ్చల్ మల్కాజిగిరి, ములుగు, నాగర్‌కర్నూల్, నల్గొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్ మరియు యాదాద్రి భువనగిరి.

3.నియామకం క్రింది కేటగిరీలలో జరుగుతుంది: అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (10వ తరగతి), అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (8వ తరగతి). అభ్యర్థులు తమ అర్హతల ఆధారంగా ఏ రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అగ్నివీర్ కేటగిరీలకు గరిష్ఠ వయోపరిమితి 21 సంవత్సరాల నుండి 22 సంవత్సరాలకు పెంచబడింది. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (CEE) 13 భాషల్లో (తెలుగు సహా) నిర్వహించబడుతుంది. ITI, డిప్లొమా, NCC అర్హతలు కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఉంటాయి. దరఖాస్తులు కేవలం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే సమర్పించాలి. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 01 ఏప్రిల్ 2026. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (CEE) తాత్కాలికంగా 01 జూన్ 2026 నుండి 15 జూన్ 2026 వరకు నిర్వహించబడుతుంది. అడ్మిట్ కార్డులు అదే వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

4.అభ్యర్థులు తాజా సమాచారం కోసం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ను తరచూ పరిశీలించాలి, తమ నమోదు చేసిన ఈ-మెయిల్ ఐడీలను చెక్ చేయాలి. మరిన్ని వివరాల కోసం సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్‌ను 040-27740059 నంబర్ ద్వారా సంప్రదించవచ్చు.

5.నియామక ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్, నిష్పక్షపాత, పారదర్శకంగా జరుగుతుంది. ఎవరైనా మధ్యవర్తులు లేదా మోసగాళ్లు ఉద్యోగం కల్పిస్తామని చెప్పినా నమ్మవద్దు. కేవలం కష్టపడి సిద్ధమవడం ద్వారా మాత్రమే మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. మధ్యవర్తులు లేదా ఏజెంట్లకు ఇందులో ఎలాంటి పాత్ర లేదు.

# యాదవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యత్వ నమోదు
## విద్యార్థి వసతి గృహానికి విరాళాల సేకరణ

**పెద్దపల్లి, వుదయం**




యాదవ చారిటబుల్ ట్రస్ట్ లో చేరే వారు ఈనెల 31 లోపు సభ్యత్వ నమోదు చేసుకోవాలని యాదవ చారిటబుల్ ట్రస్ట్ నాయకులు తెలిపారు. అఖిల భారత యాదవ మహాసభ, యాదవ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా పెద్దపల్లి ట్రస్ట్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంధనవేని రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ ఆదేశాల మేరకు జిల్లాలోని మండల కమిటీలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 10 నుండి జిల్లాలో ఉన్న 13 మండలాలకు మండల కమిటీలను ఎంపిక చేస్తామని, సంఘ బలోపేతానికి కృషి చేసే నాయకత్వాన్ని గుర్తించి అవకాశం కల్పిస్తామన్నారు. మహిళ, యువత, యోప విభాగాలను కూడా నియమిస్తామని అన్నారు. యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మింపబడుతున్న యాదవ విద్యార్థి వసతి గృహానికి జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్ రూ 40 లక్షలు విరాళం ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఉన్న యాదవ వ్యాపారస్తులు, కాంట్రాక్టర్లు, ఎన్నారైలు, ఉద్యోగులు, అన్ని వర్గాల యాదవ కుల బాంధవులు భవన నిర్మాణానికి సహకరించి విరాళాలను అందించాలని కోరారు. యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా పెద్దపల్లి జిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలను ఆదుకుంటున్నామని అన్నారు. యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ లో ట్రస్టీ సభ్యత్వం తీసుకోదలచిన వారు ఈనెల 31 లోపు పొందాలని విజ్ఞప్తి చేశారు. ట్రస్టీ సభ్యత్వం రూ 1,10,116, ట్రస్ట్ సభ్యత్వం రూ. 10116 చెల్లించాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు చిలారపు పర్వతాలు యాదవ్, పెగడ రమేష్ యాదవ్, గొడుగు రాజ్ కుమార్ యాదవ్, వేల్పుల నాగరాజ్ యాదవ్,గుంపుల ఓదెలు యాదవ్, బత్తిని లక్ష్మణ యాదవ్, మారం వెంకటరమణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# మార్చ్ 31, 2026 లోపు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలి

**పెద్దపల్లి, వుదయం**

మార్చ్ 31, 2026 లోపు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి క్రింద ఉన్నత చదువుల కై అందించే ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి మండల రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయానికి అర్హులైన వారు (ఏదైనా 4 సంవత్సరాల డిగ్రీ చదివిన/చివరి సంవత్సరం చదువుతున్న) వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాని,అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా,కెనడా,న్యూజిలాండ్, జర్మనీ జపాన్, సింగపూర్, సౌత్ కొరియా, మొదలగు దేశాలలో ఉన్నత చదువు చదివేందుకు వెళ్ళేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అభ్యర్థి పీజీ చదివేందుకు గ్రాడ్యుయేషన్ లో 60% కంటే ఎక్కువ మార్కులు వచ్చి ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం 5 లక్షల రూపాయల లోపు ఉండాలని , టోఫెల్ జి.ఆర్.ఈ. జి మ్యాట్లలో అర్హత కలిగి ఉండడంతో పాటు పాస్ పోర్ట్ కలిగి ఉండి విదేశీ విద్యాలయంలో ప్రవేశం పొంది ఉండాలని తెలిపారు. ఆసక్తి గల పెద్దపల్లి జిల్లా లోనిఎస్సీ అభ్యర్థులు https://telanganaepasscbbgov.in ద్వారా మార్చ్ 31, 2026 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఉప సంచాలకులు ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి మండల రవీందర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# బడ్జెట్ లో విద్య రంగాన్ని విస్మరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం
## ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్

**కరీంనగర్, వుదయం:**



విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది, ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని, ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం మేనని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 8.22% నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో విద్య పట్ల వివక్ష కనిపిస్తుందని, రాష్ట్రంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో కనీసం 15% నిధులు కేటాయిస్తామని చెప్పినదని కానీ కాంగ్రెస్ ఈ సంవత్సరానికి 8.22% మాత్రమే కేటాయించడం దారుణం అని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పదివేల కోట్ల పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేవలం పెండింగ్ స్కాలర్షిప్స్ ఫీజు రీయంబర్స్మెంట్ 4.343 కోట్లు కేటాయించి చేతులు దులుపుకోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న ఉన్నత విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు. కేటాయించడం తగదన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు. సుమారుగా 5000 కోట్ల రూపాయలను కేటాయిస్తే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల పరిస్థితి ఏంటి అని, సంక్షేమ వసతి గృహాలు, కస్తూరిబా ప్రభుత్వ పాఠశాలల ఊసే లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. డిగ్రీ కళాశాలలు, ఇంటర్నేషనల్ పాఠశాలలు, స్వంత భవనాలు నిధులు లేవని ఈ నిధులు విద్యా అభివృద్ధి కోసం కాదు, విద్యా దరిద్ర్యానికి దారి తీస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల్లో ఇచ్చిన విధంగా విద్యార్థులకు బడ్జెట్ కేటాయించకుండా విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఇలా చేస్తే రానున్న కాలంలో కాంగ్రెస్ కు రాష్ట్రంలో పుట్టగతులు ఉండవని మచ్చ రమేష్ హెచ్చరించారు.

# పవిత్ర రంజాన్ పండుగ అన్ని ఏర్పాట్లు పూర్తి
## మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య

**పెద్దపల్లి, వుదయం**



రేపు ముస్లింల పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా ఈరోజు ఈద్గా వద్ద మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను ఈరోజు మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య మరియు మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ గారు ఈద్గాను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని ముస్లిం సోదరులు నమాజ్ కు వచ్చే ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సానిటేషన్, త్రాగునీరు, టెంట్లు, కార్పెట్లు ఇతరత్రా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందని మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో రంజాన్ పండుగ జరుపుకోవాలని ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఫణీంద్ర భూపతి పటేల్, కొలిపాక సంపత్, అష్రఫ్, అస్లాం పర్వేజ్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్ జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, సురేందర్ వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ పులిపాక రాజు, మజీద్ కమిటీ సభ్యులు నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కెపిఎస్ విద్యార్థిని నేమూరి నిత్యశ్రీకి నవోదయ ప్రవేశ పరీక్షలో 2వ ర్యాంక్




కోరుట్ల మార్చి 20 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పబ్లిక్ స్కూల్ (కెపిఎస్) విద్యార్థిని నేమూరి నిత్యశ్రీ జగిత్యాల జిల్లా స్థాయి జవహార్ నవోదయ ప్రవేశ పరీక్షలో ద్వితీయ స్థానం సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది నేమూరి సురేష్ సంధ్య దంపతుల కుమార్తె నిత్యశ్రీ ఈ పరీక్షలో 96.25 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 2వ ర్యాంక్ సాదించి నవోదయ విద్యాలయంలో ప్రవేశం పొందింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ప్రిన్సిపల్ గుజ్జేటి వెంకటేశ్ మాట్లాడుతూ కెపిఎస్ లో అందిస్తున్న నాణ్యమైన విద్య క్రమశిక్షణ ఉపాధ్యాయుల తల్లితండ్రుల ప్రోత్సాహం వల్లే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు నిత్యశ్రీ విజయాన్ని పురస్కరించుకొని పాఠశాల యాజమాన్యం ఆమెను ఆమె తల్లిదండ్రులను ఘనంగా సత్కరించి మెమెంటో ఆయన అందజేశారు ఈ విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు

## విద్యారంగానికి కేటాయింపులు నామ మాత్రమే...

**తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టి ఆర్ టి ఎఫ్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బేతి సాయికృష్ణ**



కోరుట్ల మార్చి 20 (వుదయం ప్రతినిధి) తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌లో విద్యా రంగానికి చేసిన కేటాయింపులు నామమాత్రంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టి ఆర్ టి ఎఫ్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బేతి సాయికృష్ణ తెలిపారు ప్రభుత్వం మొత్తం బడ్జెట్ వ్యయాన్ని ?3,24,234 కోట్లుగా చూపినప్పటికీ విద్యారంగానికి కేటాయించిన ?26,674 కోట్లు మొత్తం బడ్జెట్‌లో కేవలం 8.23 శాతం మాత్రమేనని వారు స్పష్టం చేశారు గత ఏడాదితో పోలిస్తే ఈ వాటా కేవలం 0.65శాతం మేర మాత్రమే పెరిగిందని ఇది విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యంగా ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ నివేదికను ప్రస్తావిస్తూ బడ్జెట్‌లో కనీసం ఐదు శాతం కూడా పాఠశాలల అభివృద్ధికి నిధులు దొరకటం లేదని కమిషన్ ఎత్తి చూపిందని పేర్కొన్నారు కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన 15శాతం నిధులను విద్యాశాఖకు కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైందని ఈ అరకొర నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్వహణ అసాధ్యమని వారు పేర్కొన్నారు అదే విధంగా పెండింగులో ఉన్న పిఆర్సి ఎస్ ఎస్ ఏ కే జీ బి వి ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రస్తావనే బడ్జె ట్‌లో లేదని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే విద్యా రంగానికి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 15 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు

## 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి అందజేత...

**ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్**



జగిత్యాల మార్చి 20 (వుదయం ప్రతినిధి) జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నాగపురి సురేష్ గుండె సంబంధిత వ్యాధితో నిమ్స్ హాస్పిటల్ లో ఉండగా గ్రామ నాయకులు ఇట్టి విషయాన్ని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి శుక్రవారం అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ తో పాటు రాయికల్ మాజీ ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## ప్రెస్ క్లబ్ ఆద్వర్యంలో ఇఫ్తార్ విందు... హాజరైన ప్రముఖులు...



మెట్ పల్లి మార్చి 20 (వుదయం విలేఖరి) మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా టియుడబ్ల్యుజే ఐజెయు ఆద్వర్యంలో రంజాన్ సందర్భంగా శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు పట్టణంలోని మక్కా మసీదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖులు విలేకరులు పాల్గొని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ అందజేశారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పట్టణంలో అన్ని మతాల వారు సోదరభావంతో ఉంటారని ప్రతి పండగను అందరూ కలిసి ఆచరిస్తారని మతాలకు అతీతంగా ప్రెస్ క్లబ్ ఆద్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం సంతోషదాయకం అన్నారు ఈ కార్యక్రమంలో కోరుట్ల మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువాడి కృష్ణారావు కౌన్సిలర్ లు ఖాజా అజీమ్ గుడికందుల అజయ్ నునుగొండ నరేష్ మాజీ కౌన్సిలర్ మహ్మద్ షాకీర్ సిద్ధికి మాజీ ఎంపీపీ మారు
సాయి రెడ్డి మాజీ సర్పంచ్ కొమిరెడ్డి లింగారెడ్డి టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షులు చీటీ శ్రీనివాసరావు టీయూడబ్ల్యూజే ఐజేయు మెట్ పల్లి అధ్యక్షులు డాక్టర్ బూరం సంజీవ్ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్ ఉపాధ్యక్షులు జంగం విజయ్ అఫ్రోజ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా బాసెట్టి హరీష్ గౌరవ సలహాదారులు దాసం కిషన్ క్యాషియర్ మక్సూద్ జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి పింజర్ శివ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్ కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్ కుర్ర రాజేందర్ యానం రాకేష్ రఫీ ఉల్లా సోహెల్ హైమద్ ముత్యాల రమేష్ ఓంకారి శ్రీనివాస్ బొల్లం రాజు మాజీ అధ్యక్షులు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా రమణ ఏసమేని గణేష్ ఎండి అభిద్ శశి కుమారు అమ్ముల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# టాస్క ఆధ్వర్యంలో సంఘాలకు అవగాహన

***సీనియర్ సిటిజన్స్ జిల్లా నేత ప్రకాష్ రావు 71వ జన్మదిన వేడుకలు...***

***డాక్టరేట్ పొందిన సింగం బాస్కర్ కు సన్మానం...***

***వయోధికులకు ఆరోగ్య శిభిరం...***



జగిత్యాల మార్చి 20 (వుదయం ప్రతినిధి) సీనియర్ సిటిజన్లకు (వయోవృద్ధులు) తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆసరాగా ఉందని.రాష్ట్ర అధ్యక్షులు పి నర్సింహారావు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పిల్లల నిరాధరణకు గురవుతున్న వృద్ధ తల్లిదండ్రుల సమస్యల పరిష్కారం కు కృషి చేస్తున్నామని టాస్క రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు శుక్రవారం జిల్లా కేంద్రంలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిలింగ్ కేంద్రంలో వయోధికుల సంరక్షణ పోషణ చట్టం పై వివిధ సంఘాల ప్రతినిధులకు టాస్క జిల్లా శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సదస్సులో టాస్క జిల్లా కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు 71వ జన్మదిన వేడుకలు నిర్వహించారు తమిళ్ కల్చరల్ యూనివర్సిటీ వారి గౌరవ డాక్టరెట్ అవార్డు పొందిన జగిత్యాల నేతాజీ వృత్తి విద్యా కళాశాలల అధినేత సింగం భాస్కర్ ను సన్మానించారు వయోధికులకు వ్యాధుల నివారణకు ఆరోగ్య శిభిరం నిర్వహించి దినసరి ఆహార ప్రణాళికపై ప్రముఖ న్యూట్రిషియన్ నిపుణులు మీనారావు హెల్త్ కన్సల్టెంట్ బద్ది పవిత్రలచే అవగాహన కల్పించి హెల్త్ చెకప్ లు చేయించారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం పెన్షనర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పిసి హన్మంత్ రెడ్డి సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్ రాష్ట్ర నేత పూసాల అశోక్ రావు సీనియర్ సిటిజన్స్ జిల్లా కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు ఆర్గానైజింగ్ కార్యదర్శి కొయ్యడ సత్యనారాయణ ఎండి యాకూబ్ జగిత్యాల పట్టణ కార్యదర్శి సింగం భాస్కర్ ధర్మపురి నియోజకవర్గం అధ్యక్షులు కండ్లె గంగాధర్ బుగ్గారం కార్యదర్శి దుబ్బేష్ బీసీ మహిళా జిల్లా అధ్యక్షురాలు గంగం జలజ యువజన సంఘాల జేఏసి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దొనూరి భూమాచారి డాక్టర్ సింగం భాస్కర్ కుంటాల కిషన్ నలువాల హన్మాండ్లు ఆలిశెట్టి నారాయణ జగదీశ్వర్ రావు బ్రహ్మయ్య వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

# జనగణన కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలి

***భవిష్యత్తు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రణాళికకు గణాంకాలు కీలకం...***

***జనగణన 2027 హౌస్ లిస్టింగ్ పై సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణ...***

***శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ లు***




జగిత్యాల మార్చి 20 (వుదయం ప్రతినిధి) జనగణన కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లు బిఎస్ లత బి రాజ గౌడ్ తెలిపారు శుక్రవారం జనగణన 2027 కార్యక్రమం నిర్వహణలో భాగంగా తొలి దశలో నిర్వహించనున్న హౌస్ లిస్టింగ్ హౌసింగ్ సెన్సెస్ సంబంధించి సంబంధిత అధికారులకు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లు మాట్లాడుతూ జనగణన తొలి దశ లో నిర్వహించాల్సిన హౌస్ లిస్టింగ్ కార్యక్రమం పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో చెప్పిన అంశాలు ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని అన్నారు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో పలు మార్లు సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించామని ఇందులో సమాచారం అందించడం ఐచ్చికమని కానీ జనగణన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు జనగణన కార్యక్రమంలో సమాచారం ఇవ్వడానికి నిరాకరించినా తప్పుడు సమాచారం అందించిన చట్టం ప్రకారం కేసు నమోదు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు ఎన్యుమరేటర్లకు జనగణన సంబంధించి అన్ని అంశాలలో పూర్తి అవగాహన ఉండాలని అన్నారు జనగణన సంబంధించి అధికారులకు ఇచ్చిన మేటిరియల్ ఒకటి రెండు సార్లు చదవాలని అన్నారు జనగణన సంబంధించి సాఫ్ట్ వేర్ పని తీరు గమనించాలని ప్రతి ఒక్క అంశాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కింది స్థాయి సిబ్బందికి వదిలి పెట్టవద్దని అన్నారు జనగణన కార్యక్రమం దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు ప్రజల నివాస గృహాల వివరాలు మౌలిక సదుపాయాల స్థితి కుటుంబాల వివరాలు తదితర అంశాలను ఈ దశలో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు శిక్షణలో భాగంగా డేటా సేకరణ విధానం డిజిటల్ పరికరాల వినియోగం ఫీల్డ్ స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు మే 11 నుంచి జనగణన కార్యక్రమం ప్రారంభమై అవకాశం ఉందని పేర్కొన్నారు జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు

ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు అవసరమైన ఖచ్చితమైన గణాంకాలు సిద్ధమవుతాయని పేర్కొన్నారు ఈ శిక్షణ కార్యక్రమంలో ఏవో హకీమ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# విద్యకు సరిపోని కేటాయింపులు...

***పెండింగ్ బిల్లులు పిఆర్సీ ప్రస్తావన లేకపోవడం విచారకరం...***

***ఉద్యోగుల ఆరోగ్య పథకం క్రింద ఉచిత వైద్యం స్వాగతిస్తున్నాం...***

***స్టేట్ టీచర్స్ యూనియన్***




జగిత్యాల మార్చి 20 (వుదయం ప్రతినిధి) జనాకర్షక పథకాలకే తప్ప ప్రస్తుత విద్యా వ్యవస్థను బాగు చేసే విధంగా విద్యారంగానికి కేటాయింపులు లేవని స్టేట్ టీచర్స్ యూనియన్ జగిత్యాల జిల్లా శాఖ అభిప్రాయపడింది శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పై ఎస్టీయూ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు బైరం హరికిరణ్ పాలేపు శివరామకృష్ణ మాట్లాడుతూ 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ 3,24,234 కోట్ల బడ్జెట్ లో విద్య మానవ వనరులకు కేటాయించింది 26,674 కోట్లు మాత్రమే ఇది మొత్తం బడ్జెట్లో 8.2శాతం ఉదయం అల్పాహారం ఇంటర్ వరకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఆహ్వానించదగినదే గత సంవత్సరం కంటే రూ 3,566 కోట్లు అదనంగా కేటాయించినప్పటికీ పెంచిన మొత్తం బ్రేక్ ఫాస్ట్ ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు కోసమే సరిపోకపోవచ్చు అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల గురించి మధ్యాహ్న భోజనం నాణ్యత పెంపు గురించి అదనపు నిధుల కేటాయింపు ప్రస్తావన లేదు గత సంవత్సరం 7.58 శాతం కేటాయించగా ఈ సంవత్సరం 8.22 శాతం కేటాయించారు విద్యకు 15షాట్ కేటాయిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టో లో పేర్కొన్న హామీ వరుసగా 3 వ సారి బడ్జెట్లో కూడా నెరవేరలేదు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ను సమీక్షించి కనీసం 15శాతం కేటాయించాలని ఎస్టియు డిమాండ్ చేసింది ఉద్యోగుల ఆరోగ్య పథకానికి 1056 కోట్ల రూపాయలు కేటాయింపును స్వాగతిస్తూనే మరి పిఆర్సీ సంగతేంటి? అని ప్రశ్నించారు ఉద్యోగుల ఆరోగ్య పథకానికి అయ్యే ఖర్చు మొత్తం 1056 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వమే భరించి ఉద్యోగులకు పెన్షనర్ల కు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు డిజిటల్ హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్టేట్ టీచర్స్ యూనియన్ స్వాగతిస్తున్నదన్నారు తెలంగాణ రెండో పీఆర్సీ అమలు గురించి గానీ అదనపు నిధుల కేటాయింపు గురించి గానీ బడ్జెట్ లో ప్రస్తావించకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయులను నిరాశకు గురి చేసిందన్నారు ఇప్పటికే పిఆర్సీ అమలు 33 నెలలు ఆలస్యమైందనీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో మంచి పిఆర్సీ అమలు చేస్తామని మేనిఫెస్టో లో ఇచ్చిన హామీని 27 నెలలు గడుస్తున్నా నిలబెట్టుకోక పోవడం విచారకరమన్నారు పెండింగ్ డిఎలు పెండింగ్ బిల్లులు 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు గురించి ప్రస్తావనే లేదన్నారు రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సీ పెండింగ్ బిల్లులు బకాయిల గురించి కూడా స్పష్టత ఇవ్వాలని ఎస్ టి యు జగిత్యాల జిల్లా శాఖ డిమాండ్ చేస్తున్నది.రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్.రాష్ట్ర ఉపాధ్యక్షులు సీర్ణంచ రవీందర్ జిల్లా ఆర్థిక కార్యదర్శి మేకల ప్రవీణ్ ఉన్నారు



## బిజెపి కోరుట్ల పట్టణ అధ్యక్షులుగా కస్తూరి లక్ష్మీ నారాయణ

కోరుట్ల మార్చి 20 (వుదయం ప్రతినిధి)కోరుట్ల పట్టణంలోని కోరుట్ల నియోజకవర్గ నాయకుడు డాక్టర్ వై అనూప్ రావు నివాసంలో నిర్వహించిన సమావేశంలో కురుట్ల పట్టణ భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షులుగా 11వ వార్డ్ కౌన్సిలర్ కస్తూరి లక్ష్మీ నారాయణ ని జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు డాక్టర్ వై అనూప్ రావు రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ లక్ష్మీనారాయణకి అధ్యక్షుడి నియామక పత్రం అందచేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరుట్ల పట్టణంలో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని మున్సిపల్ లో బీజేపీ గొంతు బలంగా వినిపించాలని ఆదేశించారు అనంతరం కస్తూరి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నన్ను పట్టణ అధ్యక్షుడిగా నియమించిన ఇందూరు పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ బిజెపి జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు డాక్టర్ వై అనూప్ రావు రుద్ర శ్రీనివాస్ లకు కృతజ్ఞతలు తెలియ చేస్తూ కోరుట్ల పట్టణంలో ప్రతి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతానని ప్రతి ఒక్క కార్యకర్తని నాయకున్ని కలుపుకొని పని చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ 27 వ వార్డు కౌన్సిలర్ తిరుమల వాసు మెట్పల్లి పట్టణ 26 వార్డు కౌన్సిలర్ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివ్ పట్టణ ప్రధాన కార్యదర్శిలు చెట్లపెల్లి సాగర్ ఎర్ర రాజేందర్ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధోనికెల నవీన్ మెట్పల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి సంకట విజయ్ బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షులు రాగం శెట్టి సాయి కృష్ణ సీనియర్ నాయకులు తులసి కృష్ణ బేక్కం అశోక్ రాధారాపు సత్యనారాయణ బీజేవైఎం నాయకులు ప్రేమ్ సాగర్ రాహుల్ బీజేపీ బీజేవైఎం వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య...

కోరుట్ల మార్చి 20 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణ రాంనగర్ కు చెందిన వీరమల్ల ప్రసాద్ (48) అనే వ్యక్తి కోరుట్ల పట్టణ డాగ్ బంగ్లా వద్ద కిరాణా షాప్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు అయితే ఇతనికి ఇద్దరు కొడుకులు ఒక కూతురు కలదు ఇతని కూతురు ఎర్రం శెట్టి రాజ్యలక్ష్మి ఆమెకు ఐదు సంవత్సరాల క్రితం వివాహం కాక ఆమెను మూడు సంవత్సరాల కుమారుడు శివ నరేంద్ర కలదు ఇతడికి బ్లడ్ క్యాన్సర్ రావడం వల్ల ఇతని చికిత్స గురించి వేరే మల్ల ప్రసాద్ చాలా మంది దగ్గర అప్పులు చేసి ఇతడికి చికిత్స చేయించాడు ఇట్టి చికిత్స కొరకు వీరమల్ల ప్రసాద్ 45 లక్షల వరకు అప్పు అయింది ఇట్టి అప్పు తీర్చుటకు రెండు నెలల క్రితం వీరి యొక్క ఇల్లు అమ్మినారు అయినా కానీ అప్పు తీరలేదు గత మూడు రోజుల నుండి ప్రసాద్ అట్టి అప్పులు తీర్చాలని బాధపడుతూ తేదీ 20 3 2026 శుక్రవారం ఉదయం అతని భార్య వీరమల్ల కావ్యాను కిరాణా షాపులో ఉంచి స్నానం చేసి వస్తానని ఇంటికి వెళ్ళాడు చాలాసేపటి వరకు భర్త వీరమల్ల ప్రసాద్ ఇంకా షాప్ కి రాకపోయేసరికి ఆమె తన పెద్ద కొడుకును షాప్ లో ఉంచి ఇంటికి వెళ్లి చూసేసరికి వీరమల్ల ప్రసాద్ బెడ్ రూమ్ లో బెడ్ మీద నురగలు కక్కుకొని పడి ఉన్నాడు వెంటనే చుట్టుపక్కల వారి సహాయంతో అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్లు పరీక్షించి చనిపోయాడని తెలిపారు అప్పుల బాధ భరించలేక ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని వీరమల్ల ప్రసాద్ భార్య విరమణ కావ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

## డాక్టర్ సింగం భాస్కర్ కు టీబిసీ జేఏసి టాస్కా ల సన్మానం...





జగిత్యాల మార్చి 20 (వుదయం ప్రతినిధి) అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కిన జగిత్యాల పట్టణ నేతాజీ కళాశాల అధినేత సింగం భాస్కర్ ను టీబిసీ జేఏసి రాష్ట్ర అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ సంఘాల ప్రతినిధులు సన్మానించారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో డాక్టరెట్ పొందిన సింగం బాస్కర్ ను టీబిసీ జేఏసీ సీనియర్ సిటిజన్స్ పెన్షనర్స్ సంఘాలు సన్మానించాయి ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ గత 38ఏళ్ళు గా విద్యారంగంలో భాస్కర్ విశిష్ట సేవలు అందించాడని అనేక మంది నేతాజీ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని కొనియాడారు ఈ కార్యక్రమంలో టీబిసీ జేఏసీ జిల్లా అధ్యక్షులు కొండా లక్ష్మణ్ మహిళా ఈ అధ్యక్షురాలు గంగం జలజ సీనియర్ సిటిజన్స్ నేతలు గౌరిశెట్టి విశ్వనాథం పిసి హన్మంత్ రెడ్డి అశోక్ రావు సింగం గంగాధర్ వెళముల ప్రకాష్ రావు పెన్షనర్స్ నేతలు వీరా రెడ్డి గంగాధర్ ఉమ్మడి జిల్లా యువజన జేఏసీ అధ్యక్షులు దొనూరి భూమాచారి తదితరులు పాల్గొన్నారు

## జనగణన విధులు సమర్ధవంతంగా నిర్వహించాలి

**కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల, మార్చి 20 (వుదయం ప్రతినిధి) : జనగణన–2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన విధులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా జనగణన అధికారి పాపయ్య, ఉపగణాంక అధికారి, అదనపు జనగణన అధికారి రాజేందర్ లతో కలిసి మండల ప్రణాళిక గణాంక అధికారులు, సాంకేతిక సహాయకులకు జనగణన ప్రక్రియ, యాప్ నిర్వహణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయబోయే సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు జనాభా లెక్కల ప్రాతిపదిక ఉపయోగపడుతుందని తెలిపారు. జనగణన విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి యాప్ ద్వారా జనగణన చేయాలని తెలిపారు.